
# ఫ్లాష్ బ్యాక్



పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం

## డి. రామానాయుడు

## - చిత్ర నిర్మాణం

### ( విజయచిత్ర 1983, మార్చి సంచిక నుంచీ పునర్ముద్రణ)



**పరిశ్రమలో** రామానాయుడి మీద ఒక జోకు చెప్పుకుంటారు.

ఒక రచయిత కథ వినిపించడానికొచ్చాడు.

చెప్పండన్నారు నాయుడు. రచయిత ఆరంభించాడు.

"ఒక పురిపాక. చుట్టూ మురికి సందులు. ఆ పూరిపాకలో దీనంగా కూచుని లాంతరు దీపం ముందు ఏదో రాసుకుంటూ వుంటాడు హీరో."

"హీరో?"

"అవును హీరో. అంతలో తలుపు చప్పుడవుతుంది.."

"వద్దులెండి. మరేదైనా కథ చెప్పండి."

"మీరు పొంతం వినండి. మంచి డ్రామా వున్న సబ్జెక్టు. మీకు నచ్చుతుందనే చెప్పబోతున్నాను."

"సారీ ఇంకేదైనా కథ చెప్పండి."

"ఒక పెద్ద బంగళా, చుట్టూ పూలతోటలూ, లాన్లూ. లాన్ల మధ్యలో ఎత్తయిన రంగురంగుల దీపస్థంభాలు. స్థంభాల మధ్యలో పెద్ద ఫౌంటెను. ఒక పెద్ద విదేశీయ కారు పోర్టికోలోకొచ్చి ఆగింది. తెల్లదుస్తుల్లో వున్న నలుగురు నౌకర్లు గబగబా వచ్చి కారు తలుపులు తెరిచారు. మల్లెపువ్వులాంటి సూటు వేసుకుని, క్రాపు సరిచూసుకుంటూ దిగాడు హీరో. అతి విశాలంగా అధునాతనంగా వున్న హాల్లోకి ప్రవేశించాడు. అద్భుతమైన 'కార్పెట్' కాలు మోపబోతూ, ఆగాడు."

"మీరు ఆగకండి చెప్పండి" అన్నారు రామానాయుడు కుతూహలంగా.

ఇదీ ఆయనమీద వున్న జోకు. కథలో భారీతనం బాగా వుంటేనే కథ వింటారనీ, కథ ఎంత మంచిదైనా 'భారీతనం' లేకపోతే అసలు కథే వినరనీ. ఈ మాటే ఆయన్ని అడిగితే

"అదంతా వట్టిది. నిజంగా జోకే. అదేం లేదు. నేను పాపకోసం తియ్యలేదా? మొరటోడు తియ్యలేదా? సావాసగాళ్ళు తియ్యలేదా? ద్రోహి తియ్యలేదా? ఐతే ఎక్కువగా నేను భారీ చిత్రాలు నిర్మించాను గనక, నామీద ఒక ముద్ర పడింది అంతే. కేవలం నేను భారీ చిత్రాలే నిర్మిస్తాననుకోడం పొరపాటు. కాకపోతే, నాకు దొరికిన కథలు అలాంటివి. ప్రజలు మెచ్చుకున్న నవలల్ని సినిమాలుగా తియ్యడంలో సహజంగా వున్న భారీతనం కనిపించాలి కదా. కథకు అవసరమై నేను, భారి సెట్టు వేసి చిత్రాలు తీశానుగాని, అనవసరంగా వెయ్యలేదు. అలాగే, పాత్రకు తగ్గట్టే నటీనటులనూ ఎన్నుకుంటాను.

నాకు తొలిచిత్రమే (రాముడు భీముడు – అంతకు ముందు 'అనురాగం'లో భాగస్వామి) భారీ చిత్రమైంది. తారలు, ఎక్కువ సెట్లు, పాత్రలూ. ఐతే కథ వుండాలి కదా. కథ లేకుండా వట్టి భారీతనం ఎవరైనా చూపిస్తారా?" అని అడిగారు రామానాయుడు.

ఆయనమీద ఇంకో అభియోగంకూడా వుంది. తారలకు పారితోషికం ఎక్కువగా ఇస్తారనీ, పెంచుతారనీ. దీనివల్ల తక్కువ బడ్జెట్‌లో తియ్యాలనుకున్న చిన్న నిర్మాతలు సమస్యల్లో పడిపోతున్నారనీ. ఎంచేతంటే "రామానాయుడుగారు ఇచ్చినది ఇంత. మీరూ అంతే ఇవ్వాలి" అంటారట తారలు. ఇలా అనవసరంగా పెద్ద నిర్మాతలు తారల పారితోషికాలు పెంచేస్తూవుంటే, మేం ఏం చెయ్యాలి? అని తక్కిన నిర్మాతలు అంటారు.

ఈ మాట రామానాయుడుని అడిగినప్పుడు 'అదంతా వట్టిది.అందులో ఏ మాత్రం నిజంలేదు' అన్నారు.

"నేనుగా ఎన్నడూ పారితోషికం పెంచలేదు. అనవసరంగా కొందరు అలాంటి అభాండాలు వేస్తూ వుంటారు. కాకపోతే, తారలు కూడా పెద్ద నిర్మాతల పేర్లు చెప్పి – "ఇంత పెంచారు" అని, చెప్పి వుండొచ్చు. ఏమో పెంచిన నిర్మాతలు వుంటే వుండొచ్చు గాని నేనెప్పుడూ పెంచలేదు. పైగా తక్కిన నిర్మాతలు ఇచ్చే పారితోషికం కంటే, తక్కువే ఇచ్చానుగాని,

ఎక్కువ ఎన్నడూ ఇవ్వలేదు. ఈ విషయం తారలు ఎవర్ని అడిగినా చెబుతారు. నిజానికి రెగ్యులర్ ప్రొడ్యూసర్ల దగ్గర తారలు డిమాండ్ చెయ్యరుకూడా, అందువల్ల తక్కినవారు అన్న మాటలు 'నింద'లే గాని, నిజంకావు.

పైగా, నేనేదో పెద్ద బిజినెస్ మాన్‌ని అనడం కూడా పొరపాటే. నా చిత్రాలు నిర్మాణంలో వుండగానే కొనుగోలుదార్లు ఎక్కువ డబ్బు ఇచ్చి కొనడానికి ముందుకొస్తూ వుంటారు. కాని, నేను ఎక్కువ చిత్రాలు అమ్మలేదు. డిస్ట్రిబ్యూషన్ మీదనే ఆధారపడ్డాను. సినిమాలు టకటకా తీసి, లాభాలకు అమ్మేస్తూ వుంటే, నన్నొక 'బిజినెస్‌మాన్' కింద జమకట్టవచ్చు" అన్నారు రామానాయుడు.

"ఇన్ని చిత్రాలు నిర్మించినా కేవలం కొత్తవాళ్ళనే పెట్టి, తక్కువ బడ్జెట్‌లో ఒకటి, రెండు చిత్రాలు ఎందుకు తియ్యరు?" అన్న ప్రశ్నకు ఆయన ఇచ్చిన జవాబు:

"తప్పకుండా తీస్తాను. తియ్యాలని వుంది కాని అలాంటి ప్రయోగాలు చెయ్యడానికి బాగా తీరిక, ఓపిక కావాలి. అటువంటి దర్శకుడు కావాలి. కొత్తవాళ్ళకు ట్రైనింగ్ ఇవ్వాలి. అలాంటి దర్శకులు ఇవాళ ఎక్కడున్నారు? ఐతే ఒకర్ని విమర్శిస్తున్నానని కాదు. పరిస్థితులు అలా వున్నాయి. ఈ పరిస్థితుల్ని ఎవరూ సర్దుబాటు చెయ్యలేరు. సర్దుకుంటే, వాటంతటవే సర్దుకోవాలి. నేను చెప్పాను కూడా కొత్తవాళ్ళతో, తక్కువ బడ్జెట్‌లో తియ్యాలనుకునే దర్శకుడెవరైనా, కథ నాకు వినిపిస్తే తప్పకుండా చేస్తాను. కాని, ఎవరూ ముందుకు రావడంలేదు. తమిళ చిత్రాల్లాగా తక్కువ 'బడ్జెట్'లో తియ్యగలిగే దర్శకులు మనకి లేరనిపిస్తుంది."

రామానాయుడు తమిళంలో ఆరు చిత్రాలు తీశారు. 'వసంతమాళిగై' (ప్రేమనగర్) బాగా నడిచింది. తెలుగులోలాగా తమిళంలో ఎక్కువగా ఎందుకని చిత్రాలు నిర్మించడంలేదు?

దానికి ఆయన చెప్పిన సమాధానం:

"ముఖ్యంగా నాకు కలిసి రాలేదు. అక్కడ డిస్ట్రిబ్యూషన్ లేదు. నాకు అది అలవాటు. సినిమా తీసి పెట్టుకుని, కొనడానికి ఎవరొస్తారా అని ఎదురుచూస్తూ కూచోవాలి. పైగా, మనకీ వాళ్ళకీ నిర్మాణ విధానంలో కూడా కొన్ని తేడాలున్నాయి. ఇంకోటి కూడా వుంది. నేను తెలుగు, హిందీ చిత్రాలు తియ్యడంలో తమిళం మీద కూడా శ్రద్ధ వహించడం కష్టమవుతూ వుంటుంది. ఐనా, తీస్తూనే వున్నాను. ఇంత జోరుగా కాకపోయినా."

రామానాయుడు 'అనురాగం' చిత్రం తీస్తున్నప్పుడు పరిశ్రమలో చేరారు. ఆ చిత్రం నిర్మించిన అనురూపా సంస్థలో ఆయన భాగస్వామి. ఆ చిత్రం పూర్తికాగానే, సురేష్ ప్రొడక్షన్స్ ఆరంభించి 'రాముడు – భీముడు' తీశారు. ఇది ఘనవిజయం సాధించింది. ప్రతిజ్ఞా పాలన, శ్రీకృష్ణ తులాభారం, స్త్రీ జన్మ, పాపకోసం, బొమ్మలు చెప్పిన కథ, సిపాయి చిన్నయ్య, ద్రోహి, ప్రేమనగర్, జీవనతరంగాలు, చక్రవాకం, సెక్రటరీ, సోగ్గాడు, చిలిపికృష్ణుడు, మొరటోడు, ఎంకి

నాయుదుబావ, ఒక చల్లనిరాత్రి, మండేగుండెలు, అమ్మాయిల శపథం, సావాసగాళ్ళు, అగ్నిపూలు, ప్రేమమందిరం, కక్ష, దేవత, ముందడుగు మొదలైన చిత్రాలు నిర్మించారు. తమిళంలో కుళందైకాగ, నమ్మ కుళందైగళ్, వసంతమాళిగై, తిరుమాంగల్యం, మధురగీతం, తనికాట్టురాజా – చిత్రాలు నిర్మించారు. ప్రేమ్ నగర్, దిల్‌దార్, దిల్ అవుర్ దీవార్,బందిష్ చిత్రాలు హిందీలో నిర్మించారు.

జూన్ నెల నుంచి హిందీ, తెలుగు ఆరంభిస్తున్నారు. జితేంద్ర, శ్రీదేవి, జయప్రదలతో హిందీ చిత్రం, ఒక ప్రముఖ హీరోతో తెలుగు చిత్రం ఆరంభిస్తారు. లోగడ జి.వి.ఆర్ శేషగిరిరావు. కె.బాపయ్యలను పరిచయం చేసిన రామానాయుడు మురళి అనే కొత్త దర్శకుడిని ఈ చిత్రంతో పరిచయం చేస్తున్నారు.

"ఐతే ఇవాళ హడావుడి ఎక్కువైపోయింది. నిదానంగా తీసుకోవడం అన్న పద్ధతి తగ్గిపోయింది. 'రాముడు భీముడు' రోజుల్లో ఒక పాటను మూడు రోజులు తీశాం. ఇప్పుడు ఒకరోజు, రోజున్నరలో తియ్యాల్సి వస్తోంది. నటీనటులు క్వాలిటీ కోసం ఆలోచించడంలేదు. సినిమా మొత్తం 25రోజుల్లో తియ్యడం అలవాటైపోయింది. మనం నిదానంగా తియ్యాలని స్టార్స్‌ని ఎక్కువ రోజులు కాల్‌షీట్స్ అడిగితే, కుదరడంలేదని చెబుతున్నారు. ఎండ వున్నా లేకపోయినా, అన్ని దీపాలూ వెలగకపోయినా, 'ఫ్రేమింగ్' సరిగ్గా చూడ్డానికి కూడా అవకాశం లేకపోయినా, తియ్యవలసి వస్తోంది. దానివల్ల క్వాలిటీ ఏమొస్తుంది? ఐతే నేను ఎవర్నీ నిందించను. ఎవరి నమ్మకాలు వాళ్ళవి. ఎవరి ఇబ్బందులు వాళ్ళవి. వాళ్ళ వాళ్ళ దృష్టిలో వాళ్ళు రైటు. నా దృష్టిలో నేను రైటు" అన్నారాయన.

"కొందరి మీద ప్రజల్లో ఒక్కో రకమైన అభిప్రాయం వుంటుంది. నేను 'రాముడు భీముడు' తీసిన తర్వాత, అలాంటి చిత్రాలే ఇస్తానని ఎదురు చూశారు. అందుకని అలాంటివే తియ్యాలి. 'రామానాయుడు సినిమా' అంటే, భారీగా నిండుగా వుంటుందనే అభిప్రాయం నాటుకుపోయింది. ఆ అభిప్రాయానికి భిన్నంగా తీస్తే చప్పరిస్తారు. అంచేత ఆ నిండుదనం కోసం ఎంతయినా ఖర్చు చెయ్యాలి. ఒక షాటు కోసం పాతికవేల రూపాయలు ఖర్చు చేసినవీ వున్నాయి. 'ముందడుగు'లో రెండు కార్లు ఢీ కొట్టడం తియ్యడానికి ఎంతో వ్యయమైంది."

రామానాయుడు దర్శకత్వం కూడా చేపడతారనీ, హైదరాబాదులో స్టూడియో నిర్మిస్తారనీ వార్తలున్నాయి. ఆ విషయంగా అడిగినప్పుడు, దర్శకత్వమీద తనకు సంకల్పం వున్నమాట నిజమేగాని, ఆ విషయం ఇప్పుడే చెప్పలేనన్నారు. ("నిర్మాత రామానాయుడు 'అవకాశం' కల్పించాలిగదా" అన్నారు 'జోక్యులర్'గా) స్టూడియో విషయం ఈ మధ్యనే ముఖ్యమంత్రితో మాట్లాడాననీ, ఆయన పథకాలన్నీ సమగ్రంగా చర్చ చేద్దామన్నారనీ, ఆ చర్చ అయిన తర్వాత స్టూడియో నిర్మాణ విశేషాలు చెబుతాననీ చెప్పారాయన.

COMMENTS